క్లుప్తంగా

లైన్‌మన్ కుటుంబానికి పరిహారం అందజేత



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈ నెల 6వ తేదీ రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జూనియర్ లైన్‌మన్ రాయల తిలక్ కుటుంబానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నష్టపరిహారం మంజూరు చేశారు. ఖాజీపేటలోని మృతుడి భార్యకు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈఈ కెవై.కొండలరావు, ఏఈ జి.శ్రీనివాసరావుతో కలసి ఎంపీపీ పాలడుగు జోత్స్న ఆదివారం రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీఐ పి.శ్రీను పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



ఇబ్రహీంపట్నం: ఆషాఢ మాసం సందర్భంగా కిలేశపురంలోని శ్రీగంగానమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పుష్కలంగా వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించి బొడ్డు రాయికి నీళ్ల వారబోసి పసుపు కుంకమలతో పూజలు చేశారు. అక్కడి నుంచి 101 నీళ్ల బిందెలు తలపై మోసుకుని మేళతాళాలతో గంగానమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో వందేళ్ల చరిత్ర కలిగిన వేపచెట్టుకు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండలంలోని వివిధశాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎంపీపీకి ఘన నివాళి



విస్సన్నపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ ఎంపీపీ, అయ్యప్పస్వామి జ్యోతిపీఠం గురుస్వామి మాగంటి కృష్ణమోహన్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పీఠాల గురుస్వాములు, సభ్యులు ఓలేటి దుర్గారావు, నెక్కళపు కుటుంబరావు, ప్రసాద్, చక్రవర్తి, కోటేశ్వరరావు, రంగారావు, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం కోరుతున్న క్రీడాకారుడు

తిరువూరు: పవర్ లిఫ్టింగ్‌లో పలు జాతీయ స్థాయి పతకాలు సాధించిన తిరువూరు మండలం రోలుపడికి చెందిన కందుల బాబూరావు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి అవకాశం లభించింది. సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఈ నెల 31 నుంచి ఆగస్టు ఏడో తేదీ వరకు జరిగే 8వ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో బాబూరావు పాల్గొననున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికస్థోమత లేనందున స్పాన్సర్లు సహకరించాలని కోరుతున్నాడు. బాబూరావు సెల్ నంబరు 9963589793.

దుర్గమ్మకు ఆషాఢ సారె



తిరువూరు: ఆషాఢ మాసం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు తిరువూరు వాసవీ, వనిత క్లబ్బుల సభ్యులు ఆదివారం సారె సమర్పించారు. స్థానిక శ్రీరామలింగేశ్వరాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, వాసవీ క్లబ్స్ సభ్యులు కొత్తగుండ్ల ప్రసాదరావు, దోసపాటి రవికుమార్, చిత్తలూరి నాగలక్ష్మి, జూలూరి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో విజయవాడ తరలివెళ్లారు. వాసవీ, వనితక్లబ్‌లు, ఆర్యవైశ్య మహిళా విభాగం, యువసేన, సీనియర్ సిటిజన్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళల జీవితాల్లో వెలుగులు

నూజివీడుకు రూ.19.92 కోట్ల జమ

నూజివీడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేసి, ఇప్పటి వరకు మూడు విడతలుగా రుణమాఫీ (వైఎస్సార్ ఆసరా) అమలు చేసి విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏప్రిల్ 11, 2019 వరకు డ్వాక్రా సంఘాలకు బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నిధులను డ్వాక్రా సంఘాలకు విడుదల చేసి, మహిళలకు తోడ్పాటుగా నిలిచారు. దీంతో మహిళలు అధిక వడ్డీ రేటుకు ప్రైవేటు వ్యాపారుల వద్ద రుణం తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇచ్చిన హామీని అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్ల తాము విధేయతగా ఉంటామని మహిళలు పేర్కొంటున్నారు.

మూడు విడతల్లో రూ.19.92 కోట్లు జమ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నూజివీడు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడు విడతల్లో రూ.19.92 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో చిన్న అవసరాలను తీర్చుకోవడం, పాడి గేదెలను కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా రోజువారీ ఆదాయం సమకూర్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. రుణమాఫీతో పాటు సున్నావడ్డీ డబ్బులు క్రమం తప్పకుండా సమయానికి జమ చేస్తుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

విడుదలైన నిధుల వివరాలు

విడత	గ్రూపులు	లబ్ధిపొందిన సభ్యులు	విడుదలైన మొత్తం
1వ విడత	653గ్రూపులు	6,296 మంది	రూ.6.17 కోట్లు
2వ విడత	662గ్రూపులు	6,318 మంది	రూ.6.86 కోట్లు
3వ విడత	662గ్రూపులు	6,385 మంది	రూ.6.89 కోట్లు
			రూ.19.92 కోట్లు

రూ.4.38 లక్షలు జమయ్యాయి



మాది సాయిరామ్ మహిళా సంఘం. మా గ్రూపు సభ్యులకు ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.4.38 లక్షలను ప్రభుత్వం జమ చేసింది. మా గ్రూపులో ఉన్న పది మందికి ఒక్కొక్కరికి రూ.43,800 జమయ్యాయి. వీటితో తాము కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నాం. మాట ఇచ్చి తమ రుణాలను మాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

– నాయుడు మధులత, 11వ వార్డు, నూజివీడు

రూ.48 వేలు జమయ్యాయి



మాది విజయలక్ష్మి మహిళా సంఘం, మాకు ఒక్కొక్కరికి ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.48 వేలు జమయ్యాయి. గ్రూపునకు మూడు విడతల్లో కలిపి రూ.4.80లక్షలు వచ్చాయి. ఈ నగదు మేము ఇల్లు కట్టుకునేటప్పుడు ఉపయోగపడ్డాయి. చెప్పిన మాటపైన సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలబడ్డారు.

– కస్తూరి మల్లేశ్వరి, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

అవసరాలకు ఉపయోగపడ్డాయి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మాకు ఒక్కొక్కరికి రూ.28వేలు చొప్పున వచ్చాయి. వీటిని కుటుంబ అవసరాలకు ఉపయోగించుకున్నాం. ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

– కదం గీతాదేవి, గాంధీనగర్, నూజివీడు

నేడు జగనన్న సురక్ష శిబిరం

చాట్రాయి: మండలంలోని జనార్దనవరంలోని సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ముక్కొల్లుపాడులో..

నూజివీడు: మండలంలోని ముక్కొల్లుపాడులో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు ఏమైనా సమస్యలున్నట్లయితే అర్జీని అందజేసినట్లయితే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొంటారని తెలిపారు.

పట్టణంలో..

పట్టణంలోని ధంధం గార్డెన్‌లోని సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ ఆదివారం తెలిపారు.

కళాశాల ఏర్పాటు ఘనత కంచి రామారావుదే

తిరువూరు: ఎంతో ముందు చూపుతో జిల్లా సరిహద్దుల్లో ఉన్న తిరువూరు ప్రాంత విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత దివంగత మార్క్‌ఫెడ్ చైర్మన్ కంచి రామారావుకు దక్కుతుందని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం కంచి రామారావు జయంతి కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి తమ కుటుంబం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కంచి రామారావు కుమారుడు రఘుప్రవీణ్ తెలిపారు. కళాశాలకు రూ.1.10 లక్షల విలువైన 12 సీలింగ్ ఫ్యాన్లు, 12 ఇనుప ర్యాక్‌లను బహూకరించారు. కళాశాల పురాతన భవనం ఆధునికీకరణ, ఇతర సదుపాయాల కల్పనకు తమవంతు చేయూత అందిస్తామని తెలియజేశారు. అనంతరం రఘుప్రవీణ్ దంపతులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అబూబకర్, కంచి రామారావు కుటుంబసభ్యులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కంచి రామారావు జయంతి కార్యక్రమం

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): న్యూ కళాక్షేత్ర నృత్యశాలకు చెందిన చిన్నారులు ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గమ్మ సన్నిధిలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. 32 మంది చిన్నారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు.

అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థానం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి (నూజివీడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని వడ్లమానులో రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తూనే మరోవైపు అభివృద్ధిపై దృష్టి సారిస్తోందన్నారు. చంద్రబాబు దోపిడీనే ప్రధానంగా పాలన సాగించగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ప్రాధాన్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించారని, రాబోయే ఎన్నికల్లో సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంలో..

వడ్లమానులో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీపీ అనూష, సర్పంచ్ లక్ష్మికుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

• మెకానికల్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

తిరువూరు: తిరువూరు మెకానికల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక సుందరయ్య భవన్లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పసుపులేటి రవీంద్ర ఎన్నికయ్యారు. టూవీలర్ బైక్‌మెకానిక్ల సంక్షేమానికి కృషిచేస్తానని రవీంద్ర తెలిపారు.

వీఆర్వో ప్రతాప్ మృతి

గంపలగూడెం: గంపలగూడెం-2 వీఆర్వో మాతంగి ప్రతాప్‌కుమార్(29) హార్ట్‌ఎటాక్‌తో శనివారం రాత్రి మృతి చెందారు. అప్పటి వరకు ఇంటివద్ద తన చెల్లెలు కూతురును ఆడిస్తున్న ప్రతాప్ స్నానానికి బాత్‌రూమ్‌కు వెళ్లి కుప్పకూలిపోయాడు. వెంటనే అతని బంధువులు సహఉద్యోగులు గంపలగూడెం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, పలువురు వీఆర్వోలు, కార్యదర్శులు వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆయన మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపాన్ని కుటుంబీకులకు సానుభూతిని వ్యక్తపరచారు. మృతదేహానికి ఆదివారం సాయంత్రం గంపలగూడెం మండలం పెనుగొలనులో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి తల్లిదండ్రులు, ఒక సోదరుడు, సోదరి ఉన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగరం గ్రామంలో మామిడి తోటలో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు చేసి తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.16 వేలు, మూడు కోడిపుంజులు, 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నేటి నుంచి ధ్యాన శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిమాలయ అమరగురు ఆర్య శ్రీ మహావతార్ బాబాజీ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం నుంచి ముత్యాలంపాడులో ఉచిత ధ్యాన శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత ధ్యాన శిక్షణా తరగతులు సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ముత్యాలంపాడు గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో జరుగుతాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నీలకంఠేశ్వర స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

'జగనన్న పాలవెల్లువ'తో పల్లె ప్రగతి

- లీటరు పాలకు రూ.88
- గ్రామాల్లో విస్తరిస్తున్న సొసైటీలు

జి.కొండూరు: పాడి రైతులకు అగ్ర తాంబూళం అందించి పల్లెల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సహకార రంగంలో పాల డెయిరీలను బలోపేతం చేసేందుకు అమూల్ డెయిరీతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ విప్లవానికి తెరలేపింది. పాల ఉత్పత్తిలో ప్రభుత్వం చేపట్టిన ఈ విప్లవంతో పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించి పాడి పరిశ్రమ మరింత వృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో మహిళలను భాగస్వాములుగా పాల ఉత్పత్తిదారుల సొసైటీలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి విస్తరించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

మహిళలకు ప్రాధాన్యం

జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో 11మంది మహిళా సభ్యులతో కూడిన పాల ఉత్పత్తిదారుల సొసైటీని ఏర్పాటు చేసి పాలు సేకరిస్తున్నారు. ఈ సొసైటీలో ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. పాల కేంద్రంలో పాలు సేకరించే సమయంలో శాతం కొలిచేందుకు తీసిన శాంపిల్ పాల నుంచి వచ్చే ఆదాయం, లీటర్లను కేజీలుగా కొలిచినప్పుడు అదనంగా వచ్చే ఆదాయంతో పాటు సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు లీటరుకు రూ.1చొప్పున వచ్చే నగదును సొసైటీ జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తారు. అదేవిధంగా పాల ఉత్పత్తిదారులకు వారి బిల్లు నగదును నేరుగా వారి అకౌంట్లలో జమచేస్తారు. అంతే కాకుండా ఈ పాల సొసైటీలలో తూకం, శాతంలో ఎటువంటి మోసాలు చేసేందుకు వీలులేని నాణ్యతగల యంత్రాలను వినియోగిస్తున్నారు.

అనేక లాభాలు

ఈ పాల సొసైటీలలో పాలుపోసిన పాడి రైతులకు ఇతర డెయిరీలతో పోల్చుకుంటే అధిక ఆదాయం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. లీటరు పాలు 11శాతం వస్తే రూ.88 అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సొసైటీలో 90 రోజులు క్రమం తప్పకుండా పాలు పోసిన మహిళలకు పాడి గేదెలను కొనుగోలు చేసేందుకు రూ.30 వేల నుంచి రూ.90వేల వరకు రుణాలను అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పాల దిగుబడిని పెంచేందుకు రూ.610కి 25 కేజీల మిక్చర్ దాణాను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



జి.కొండూరులో జగనన్న పాలవెల్లువ సొసైటీలో పాలుపోస్తున్న మహిళా రైతు

మైలవరంలో నియోజకవర్గంలో పాల ఉత్పత్తిదారుల సొసైటీల వివరాలు

మండలం	సొసైటీలు	పాల ఉత్పత్తిదారులు	రోజుకు సేకరిస్తున్న పాలు లీటర్లలో
జి.కొండూరు	14	160	400–450
మైలవరం	09	235	700–750
రెడ్డిగూడెం	12	183	400–500

పాల ఉత్పత్తిలో గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలిపాం



జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా మా గ్రామంలో పాల సొసైటీకి ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 68,663 లీటర్ల పాలను మహిళా రైతులు ఉత్పత్తి చేసి రూ.39 లక్షలకు పైగా అందుకున్నారు. గతంలో కంటే ఈ సొసైటీ నుంచి మహిళలకు రూ.19లక్షలు అదనపు ఆదాయం చేకూరింది. గ్రామంలో వంద శాతం పాడిరైతులు ఈ సొసైటీకి పాలను సరఫరా చేసేలా కృషి చేస్తున్నాం.

– కాజా సంధ్యారాణి, హెచ్ ముత్యాలంపాడు సర్పంచ్

గిట్టుబాటు ధర వచ్చింది



జగనన్న పాలవెల్లువ కార్యక్రమం వల్లన నాకు అధిక ఆదాయం చేకూరింది. ఈ పాల సొసైటీ ఏర్పాటు అయిన నాటి నుంచి ఇప్పటి వరకు 2,687 లీటర్ల పాలను పోసి రూ.1,91,137 అందుకున్నాను. ఒక దశలో లీటరుకు రూ.82.50 రేటు వచ్చింది. ఈ ఉత్సాహంతో మరిన్ని పాలను ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తాను.

– చిల్లపరపు రూతమ్మ, పాల ఉత్పత్తిదారు, హెచ్ ముత్యాలంపాడు

మహిళలను ప్రోత్సహిస్తున్నాం



జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో మహిళలతో పాల ఉత్పత్తిదారుల సొసైటీల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. డ్వాక్రా సంఘాలతో సమావేశాలు నిర్వహించి పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇతర డెయిరీలకు ఈ సొసైటీలకు ఆదాయంలో వ్యత్యాసాన్ని వివరించి మహిళలను పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపేలా కృషి చేస్తున్నాం.

– అనురాధ, ఎంపీడీఓ, జి.కొండూరు